క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరుగుతున్న రొట్టెల పండగ చివరి రోజైన బుధవారం పారిశుధ్య పనులను కమిషనర్ వికాస్‌మర్మత్ పరిశీలించారు. జిల్లా వైద్యాఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సందర్శించి భక్తులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. రొట్టెల పండగలో పారిశుధ్య కార్మికుల సేవలను ప్రశంసిస్తూ అధికారులు చివరి రోజున ప్రత్యేక భోజన సదుపాయం కల్పించారు.

విజేతలకు అభినందన



నెల్లూరు (టౌన్): పురమందిరంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన జీవీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప పిలుపునిచ్చారు. నగరంలోని స్వతంత్ర పార్కులో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ వేలూరు మహేష్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రఘు, ప్రధాన కార్యదర్శి రమణయ్య, ట్రెజరర్ పళని, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి జయంతి



నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని బుధవారం నిర్వహించారు. పింగళి చిత్రపటానికి హెచ్‌ఎం భాస్కరరావు నివాళులర్పించారు. పింగళి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయుడు హరీష్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో మహిళలపై హింసను అరికట్టాలి



నెల్లూరు (టౌన్): మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు హర్ష డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ వద్ద విద్యార్థినులతో బుధవారం మానవహారం నిర్మించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీను, హేమంత్, ఘని, వాసు, మధు, కృష్ణ, హర్ష, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు అమోఘం



నెల్లూరు(బారకాసు): నగరంలోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ సందర్భంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యారోగ్యశాఖతో పాటు ఆయుష్, హోమియోపతి వైద్యసిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన లక్షలాది భక్తులకు వైద్య సేవలందించారు. దాదాపు 200 మంది సిబ్బంది మూడు షిఫ్టులలో 24 గంటలూ అందుబాటులో ఉంటూ బీపీ, షుగర్, పరీక్షలు, జ్వరం, చిన్నపాటి నొప్పులు, తదితర సమస్యలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యాధికారులు సురేంద్రబాబు, బ్రహ్మారెడ్డి, షఫీఉల్లా, సుబ్బారావు, రమేష్, ప్రసాద్, శేషయ్య, కిరణ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం



మాంగళ్యాన్ని చూపుతున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): శ్రవణ నక్షత్రం సందర్భంగా బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. తొలుత దేవదేవేరులకు పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదేవేరులతో పాటు శ్రీవారిని విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని లక్ష్మీకామాక్షి ఆలపించిన అన్నమాచార్యుల కీర్తనలు అలరించాయి. మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, గౌరవాధ్యక్షుడు టీవీ కిషోర్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీలో ప్రతిఒక్కరికీ సముచిత స్థానం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



జాకీర్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్‌కు చెందిన ముస్లిం మైనార్టీ యువనేత షేక్ జాకీర్ బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు ఎంపీ ఆదాల నగరంలోని తన నివాసంలో పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని జాకీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి పాటుపడాలన్నారు. 29వ డివిజన్ కార్పొరేటర్ సత్తార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు వరం



21వ డివిజన్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న గౌరి



29వ డివిజన్‌లో కిట్లు అందజేస్తున్న సత్తార్



13వ డివిజన్‌లో కిట్లు అందజేస్తున్న నాగార్జున

నెల్లూరు(బారకాసు): గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు వరమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. 21వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లను బుధవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్లను అందజేస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

• 13వ డివిజన్‌లోని బాలాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున గర్భిణులు, బాలింతలకు పోషకాహారానికి సంబంధించి టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మలామేరి, మస్తానమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గాంధీనగర్ సెక్టార్–2 పరిధిలోని 29వ డివిజన్ గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక కార్పొరేటర్ షేక్ సత్తార్ గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్ల పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు వాహిద, సుజాత, మస్తానమ్మ, విమలకుమారి, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు సినీఆర్కెస్ట్రా మ్యూజిషియన్స్ సమావేశం

నెల్లూరు(బృందావనం): జిల్లా సినీ ఆర్కెస్ట్రా మ్యూజిషియన్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని గురువారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి కేదార్‌నాథ్‌సింగ్ బుధవారం తెలిపారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో జరిగే సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. అసోసియేషన్ సభ్యులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

కుసుమహరిజనవాడలో వైద్యశిబిరం



నెల్లూరు(బారకాసు): నగరంలోని 9వ డివిజన్ పరిధిలోని కుసుమహరిజనవాడలో కొందరు డయేరియాకు గురయ్యారని వార్తలు రావడంతో ముందస్తు జాగ్రత్తగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య వైద్యశిబిరాన్ని పరిశీలించి వైద్యసిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ఎవరికైనా వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే వారికి అవసరమైన వైద్యసేవలు తక్షణమే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈకు సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బారాషహీద్ దర్గాలో జరిగిన రొట్టెల పండగ ముగింపు సందర్భంగా ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్యను రొట్టెల పండగ నిర్వాహక కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఐదు రోజుల పాటు రొట్టెల పండగకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నందుకు ఎస్ఈను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(పొగతోట): వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్ఏల సంఘ రాష్ట్రాధ్యక్షుడు మర్రి వెంకటేశ్వర్లు, నాయకులు చేజర్ల సుధాకర్‌రావు, చాంద్‌బాషా, నెల్లూరు సురేష్, శ్రీనివాసులు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

వినూత్న ప్రాజెక్ట్‌లను తయారు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు (టౌన్): విద్యార్థులతో ప్రజలకు ఉపయోగపడే విధంగా వినూత్న ప్రాజెక్ట్ నమూనాలను తయారు చేయించి ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. నగరంలోని ఆచారివీధిలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో నెల్లూరు డివిజన్ సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్‌పై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ కార్యక్రమం చాలా గొప్పదని, అన్ని పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుని విజయవంతం చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 15లోపు ఇన్‌స్పైర్ నామినేషన్లను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామినేషన్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు తాతాచార్యులు, రాములు, జోయల్, ప్రభాకర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): అధిక శ్రావణ మాస పూర్ణిమ సందర్భంగా సంతపేట, బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలోని రమాసత్యనారాయణస్వామి మందిరంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. కంభాలూరు శ్రీవత్సాచార్ ఆధ్వర్యంలో ఉత్తరాది, వ్యాసరాజ, రాఘవేంద్రస్వామి మఠాలకు చెందిన 36 మంది సుధాపండితులు భగవద్గీత, న్యాయసుధా, శ్రీమద్ ఆచార్యులు రచించిన 32 గ్రంథాలను పారాయణం చేశారు. అనంతరం పవన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యాసరాజమఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బారాషహీద్ దర్గాలో ప్రత్యేక దువా



నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ ముగింపు సందర్భంగా పండగ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక దువా చేశారు. రొట్టెల పండగ కమిటీ ఉపాధ్యక్షుడు ,జిల్లా దూదేకుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు షేక్ కాలేషా, సభ్యులు అబ్దుల్‌సలీం, మొహ్మద్, హుస్సేన్‌సాహెబ్, బాజీసాహెబ్, అమీర్‌బాషా పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్‌భవన్ వద్ద బుధవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఆందోళనల్లో భాగంగా విద్యుత్ భవన్ ఎదుట రిలే నిరాహారదీక్ష చేపట్టినట్లు తెలిపారు. జేఏసీ కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, నాయకులు లతీఫ్, సతీష్, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు.

6న సంగీత,నృత్య పోటీలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, రాయప్ప

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఈ నెల 6న ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో సంగీత, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను స్వతంత్రపార్కులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. వివరాలకు 77299 42543 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. వివిధ సంస్థల నిర్వాహకులు ఎస్ మురళీమోహన్‌రావు, ఏ రాయప్ప, డాక్టర్ సుబ్బారెడ్డి, శ్రీమన్నారాయణ, ఆర్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలోని విజయడెయిరీ ప్రాంతానికి చెందిన దివ్యాంగుడైన రహమత్‌బాషాకు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ట్రైసైకిల్‌ను పంపిణీ చేశారు. పదేళ్ల క్రితం పక్షవాతం బారినపడిన రహమత్‌బాషా నడిచేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద రహమత్‌బాషాకు ట్రైసైకిల్‌ను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీఆర్ శ్రీనివాసులరెడ్డి, నాగరాజు, సహదేవరెడ్డి, బ్రాహ్మారెడ్డి, వెంగళరెడ్డి, విజయ్, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



గాంధీగిరిజనకాలనీలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మాధవి

నెల్లూరు(బారకాసు): నగరంలో పింఛన్ల పంపిణీని బుధవారం ముమ్మరంగా చేపట్టారు. 21వ డివిజన్ పరిధిలోని పలువురు వృద్ధులకు వలంటీర్లతో కలిసి 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పింఛన్లు పంపిణీ చేశారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, స్థానిక నాయకులు పెంచలనరసారెడ్డి, రాజారెడ్డి, సుబ్బారావు, వెంకటరత్నం, రియాజ్, ప్రభాకర్‌రెడ్డి, రహముతుల్లా పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ గాంధీగిరిజనకాలనీలో వలంటీర్ మాధవి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

తాగునీటి సరఫరా పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 9వ డివిజన్ పరిధిలోని తాగునీటి సరఫరాను కమిషనర్ వికాస్‌మర్మత్ బుధవారం పరిశీలించారు. నవాబుపేట, బంగ్లాతోట, కుసుమహరిజనవాడ, యనమలపాళెం, తదితర ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సరఫరా తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికి తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచి నీటి సరఫరాలో ఏమైనా అంతరయాలు, సమస్యలు ఉంటే స్థానిక సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని ప్రజలకు సూచించారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, డీఈ అనిల్‌కుమార్, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలో ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని రోగాల బాధితులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మండలం బోయలచిరువెళ్లకు చెందిన రావూరు శ్రీనివాసులరెడ్డి కుమార్తె రమ్యకు సీఎం సహాయనిధి ద్వారా ముందస్తు వైద్యానికి మంజూరైన రూ.5.30 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి బుధవారం అందజేశారు. దీంతో బాధితులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భక్తులకు ఏర్పాట్లపై ధన్యవాదాలు

నెల్లూరులో మేకపాటి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఏఎస్‌పేట దర్గా ఈఓ మొహమద్ హుస్సేన్, మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని సంగానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది మైనార్టీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈద్గా మైదానం పక్కనే ఉన్న స్థలంలో షాదీమంజిల్‌ను మంజూరు చేయించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ చైర్మన్లు

ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని పలువురు నూతన పీఏసీఎస్ చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. తమను చైర్మన్లుగా నియమించడంపై మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, బట్టేపాడు, దువ్వూర్లు పీఏసీఎస్ చైర్మన్లు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యేను ఆత్మకూరు సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన జీ వేణు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వికాస్‌లో మ్యాంగో డే

నెల్లూరు(బారకాసు): బాలాజీనగర్ లోని వికాస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మ్యాంగో డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల మామిడిపండ్లను ప్రదర్శించారు. చిన్నారులు మ్యాంగో ఆకృతిలో తయారు చేసిన ఆర్టిఫిషియల్ చిత్రాలను మెడలో ధరించి ఆకట్టుకున్నారు. స్కూల్ డైరెక్టర్, 14వడివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపల్ కర్తం జ్యోతిప్రతాప్, పలువురు టీచర్స్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాహుల్ ప్రధాని కావాలని..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని కాంక్షిస్తూ డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణాల చెరువులో బుధవారం రొట్టెలు వదిలారు. తొలుత బారాషహీద్ దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకట్రావ్, ఫయాజ్, అనిల్, గణేష్, చంద్రశేఖర్, రిజ్వాన, మాబాషా పాల్గొన్నారు.